హితుల మంత్రోచ్చారణలతో వివాహమనే ఆ వేడుకకు అర్థం పూర్తిగా తెలియకున్నా, స్త్రీ జీవితంలో ఇదొక పెద్ద మలుపని మాత్రం అర్థమయింది పార్వతికి. మాంగల్యధారణ జరిగిన మరుక్షణం నుంచి తాను మరొక ఇంటిమనిషి అయిపోయింది. ఇంత వరకూ పుట్టిపెరిగిన పుట్టింటికి తాను ఒక కొత్త మనిషి అయింది. స్త్రీ జీవితంలోని మరో అధ్యాయం ప్రారంభమయిందని అనుకుంది పార్వతి, భర్తతో అత్తవారింట అడుగు పెడుతూ.

కొత్త కోడలు, కొత్త మనుషులు. పరిచయంలేని వాతావరణం. అన్నీ సందేహాలే. అన్నీ భయాలే. దానికితోడు మామగారి హుంకరింపులూ, అత్తగారి అజ్ఞలూ, ఆడబిడ్డల సూటిపోటి మాటలూ, మరదుల హేళనలూ, వీటన్నిటితో ఒక్కొకసారి మతి పోతుందనిపిస్తూంది పార్వతికి. ఇవన్నీ విశ్వనాథం బాహుబంధంలో కరిగిపోయి, అతడూ, అతని అనురాగమూ మినహా, ప్రపంచంలో మరేమీ లేవన్నంత హాయీ అనుభవిస్తూంది పార్వతి.

ఒకొక్కసారి దుఃఖం పెల్లుబుకుతుంది. అందరూ ఒక్కుమ్మడిగా సాధిస్తారు. అందరిలోను తాను ఒంటరిది అయిపోతుంది. ఉదయం ఆఫీసుకు వెళ్ళి, సాయంత్రం అలిసి వచ్చిన భర్త ముఖం చూడగానే తాను చెప్పదలుచుకున్నదేమీ చెప్ప లేదు. తన దుఃఖం అతని ముందు వెళ్ళబోసుకుని ఊరట పడదామనుకున్న ఆమె మనస్సు, తన చిరునవ్వు కోసం తపించే భర్త హృదయాన్ని గాయపరచటానికి తిరస్కరిస్తుంది. అల్లాగే రోజులు వెళ్ళిపోతున్నాయి.

శంకరం పుట్టాడు. వాడి ఆటపాటలలో, ముద్దు మాటలలో తన ఆవేదనలు మరిచిపోగలుగుతూంది పార్వతి. మాతృత్వం రావడంతోనే స్త్రీలో ఎన్నో మార్పులు వస్తాయి. ఏదో పెద్దరికం వస్తుంది. సంక్రాంతికి పుట్టింటికి పిలుచుకు వెళ్ళటానికి అన్నయ్య వస్తున్నాడంటే, పార్వతి హృదయం ఆనందంతో గంతులు వేస్తూంది. తాత్కాలికంగా ఈ వాతావరణంలో నుంచి కొంతకాలం తప్పించుకోనవచ్చనే ఆలోచన ఆమె హృదయానికి కొంత ఊరట కలిగిస్తూంది కూడా.

సీత, రామం పుట్టారు.

పాతికేళ్ళు నిండని పార్వతి శారీరకంగానూ, మానసికంగానూ కూడా మారిపోయింది, వయసు మీరిన వృద్ధురాలిలా. జీవితమంటే ఓ విధమైన నిరాశ నిండిపోయిందామెలో. ముగ్గురు బిడ్డల తల్లి తను. అయినా యేలాటి వ్యక్తిత్వమూ లేదు. ఇంట్లో అందరూ తనను ఇంకా అవహేళన చేస్తూనే ఉన్నారు. "అలా కాదు, ఇలా" అంటూ ప్రతి పనీ సరిదిద్దుతూనే ఉన్నారు. భర్తలో కూడా ఏదో మార్పు వచ్చింది. చీటికీ మాటికీ విసుక్కుంటున్నారాయన. ఏమిటీ వింత? స్త్రీ జీవితం యింత దుర్భరమైనదా? స్త్రీలూ, స్త్రీలనే హింసిస్తారు. పురుషులూ స్త్రీలనే హింసిస్తారు. ప్రకృతి కూడా స్త్రీల పట్ల అన్యాయమే చేస్తూంది! ఏమిటీ విధివైపరీత్యం! స్త్రీ జన్మించటంతోనే బానిసలా, అందరికీ ఆటవస్తువులా జన్మిస్తుందా? పోనీ యెక్కడికేనా పారిపోతేనో? కానీ ఎక్కడికి? తరుచూ యిలాటి ఆలోచనలే కలుగుతున్నాయి పార్వతికి. ఉండబట్టలేక భర్త నదేమాట అడిగింది ఒకసారి.

పిచ్చి సాకులు చూపి జారవిడుచుకోవడం అవివేకుల లక్షణం.''
ఇక మాటలు సాగనివ్వలేదు విశ్వనాథం.

పార్వతికి క్షణకాలం తానేమి వింటున్నదో, అర్థం గానంతటి మైకం కమ్మినట్లయింది. ఆజన్మాంతం కఠిన శిక్ష వెయ్యబడిన తరువాత హఠాత్తుగా శిక్ష తగ్గిపోయి, జైలు బయటికి వచ్చి విశాల ప్రపంచాన్ని ఆత్రంగా తిలకిస్తున్న ఖైదీ మనఃస్థితే, అనుభూతులే సరిగ్గా ఆమెకు కలిగాయి.

రెండు రోజులు ఇంట్లో అందరూ బాధపడ్డారీ హఠాత్పరిణామానికి. దీనికంతటికీ పార్వతే కారణమయి ఉండవచ్చుననే నిందారోపణలు, విసుర్లు కూడా ఆమె చెవిని పడకపోలేదు.

ప్రయాణమై వెళుతున్న పార్వతినీ, పిల్లలనూ, విశ్వనాథాన్ని బాధతో, నిష్టూరాలతో, దుఃఖంతో హెచ్చరిస్తూ ఆరోజున ఇంట్లోవాళ్ళంతా సాగనంపుతూంటే, వాటన్నిటి వెనక, వారిలో దాగిఉన్న మమకారం, సంతోషంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పార్వతికి అర్థం కాకపోవటంలో ఆశ్చర్యం లేదు!

రూపుమాసిన ఉత్సాహం మళ్ళీ చిగురించింది పార్వతిలో. అది వయసును కూడా అధిగమించింది. భర్త, పిల్లలు! అహర్నిశమూ, ఆ తన చిన్న సంసారం కోసం పాటుపడటమే ఆమె లక్ష్యం. అందులో ఆమె ఎలాటి కష్టమూ అనుభవించటం లేదు సరికదా, అంతులేని ఆనందాన్ని పొందుతూంది కూడా! నూతన జీవితం. ఒకప్పుడు భర్తకైనా తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తంచెయ్యలేకపోయిన పార్వతి, ఏ పనీ చెయ్యటం

చేతకాదంటూ, ఎందుకూ పనికిరాని జీవిగా పరిగణించబడిన ఆమె, అనుభవశాలి అయిన సలహాదారుగా ఇరుగు పొరుగుల మన్ననలు పొందుతూంది. తనకూ ఓ వ్యక్తిత్వం, గౌరవం అంటూ ఏర్పడ్డాయని ఆనందం ఆమె హృదయమంతా నిండి పోయింది!

ఇప్పుడు స్త్రీ జీవితాన్ని గురించి పార్వతి ఊహాలే వేరు. "నిజంగా స్త్రీగా జన్మించడంలోనే ఓ ప్రత్యేకత ఉంది. అన్ని జీవరాసులలోకి అన్నివిధాలా పరిపూర్ణత్వం కలిగిన ప్రాణి ఒక్క స్త్రీయే! అవకాశం లేకుంటే అల్లికలేని తీవెలా మట్టిమీదే చుట్టలుచుట్టుకు అణగారిపోయే స్త్రీ జీవితం, అవకాశం ఉంటే, శోభాయమానంగా అల్లుకుని పరిమళిస్తుంది." అంది ఒకసారి భర్తతో పార్వతి.

"ఎందుకైనా మంచిది. ఈ నీ అభిప్రాయాన్ని జాగ్రత్తగా వ్రాసి ఇయ్యి. దాచి ఉంచుతాను. మళ్ళీ ఎప్పుడేనా 'స్త్రీ బానిసగా జన్మిస్తుందా?' వగైరా ప్రశ్నలు వేసినపుడు నీకే ఇస్తాను" అనేశారాయన నవ్వుతూ.

దీపావళి వారంరోజు లున్నదనగా, పిలుచుకు వెళ్ళడానికి అన్నయ్య వచ్చాడు.

"ఇప్పుడే స్థిమితపడ్డాం, అన్నయ్యా! ఇంతలోనే నేనక్కడికివస్తే, పిల్లలకు చదువుపోతుంది. ఆయనకు హోటలు భోజనం బొత్తిగా పడదు. మరొకసారి వీలుచూచుకు వస్తాంలే, అన్నయ్యా!" అంది పార్వతమ్మగా నామాంతరం పొందిన పార్వతి.

